


బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామంలో పేరుకు పోయిన చెత్త


చెన్నూర్ మండలం అస్నాదలో రహదారిపై ప్రవహిస్తున్న మురికి నీరు

కోటపల్లి మండలం సర్వాయిపేటలో బోరు వద్ద అస్తవ్యస్తంగా పారిశుధ్యం

ఆంధ్రజ్యోతి విజిట్

'ప్రత్యేక' పాలన అస్తవ్యస్తం..

- సమస్యలు వినేవారు లేక ప్రజల అవస్థలు
- గ్రామ పంచాయతీల్లో కుంటుపడ్డ అభివృద్ధి
- 'ఆంధ్రజ్యోతి' విజిట్‌లో వెలుగు చూసిన సమస్యలు

గ్రామ పంచాయతీల్లో పాలన కుంటుపడింది. పాలక మండళ్ల పదవీ కాలం ఏడాది క్రితం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. కానీ అది కేవలం నామమాత్రమే అన్నట్లుగా సాగుతోం ది. గ్రామాల్లో సమస్యలపై దృష్టి కేంద్రీకరించే వారు లేకపోవడంతో ప్రజ లు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. తాగు నీటి ఎద్దడి, పారిశు ధ్యం నిర్వహణ, అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు, పేరుకుపోతున్న చెత్త ఇలా అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. వీటన్నింటిపై ఎవరికి ఫిర్యాదు చేయాలి, అసలు ఎవరు పట్టించుకుంటారు అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

మంచిర్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేకాధికారుల పాలనలో జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. గతే డాది ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాలక మండళ్ల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలన ఏర్పాటు చేశారు. సంవత్సరకాలంగా జవాబుదారీ తనం లేక ప్ర జలు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామ పంచాయతీల్లో కనీసం పా రిశుధ్య పరిరక్షణ కూడా చేపట్టడం లేదంటే అతిశయోక్తికాదు. గత సం వత్సరం గ్రామాల్లో సర్పంచులు, వార్డు మెంబర్ల పదవీ కాలం ముగిసిన తరువాత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతోపాటు రోజువారీ కార్యకలాపా ల్లో అధికారులు బిజీగా ఉన్నారు. తమ దైనందిన విధులు నిర్వహించేం దుకే వారికి సమయం దొరకడంలేదు. పైగా పంచాయతీల బాధ్యతలు అదనంగా అప్పగించడంతో పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయార నే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో ఆదివా రం గ్రామ పంచాయతీల విజిట్ నిర్వహించగా, సమస్యలపై ప్రజలు ఏకరువు పెట్టారు.

కంపుకొడుతున్న కాలనీలు..

చెన్నూరు : చెన్నూరు మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ప్ర త్యేక అధికారుల పాలనలో పారి శుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిం ది. గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ, మురికి కాలువలు సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుం ది. దీంతో దుర్గంధం వ్యాప్తి చెందుతోంది. ఆస్నాద, గంగారాం, కొమ్మెర, చాకెపల్లి తదితర గ్రామాల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్నా అధి కారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. వెంటనే పారిశుధ్య పనులతో పాటు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

బెల్లంపల్లిలో పడకేసిన ప్రత్యేక పాలన

బెల్లంపల్లి: మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉన్నాయి. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. మండలంలోని గ్రామపంచాయతీలను ప్రత్యేకాధికారులు పట్టించుకోక పోవడంతో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. పంచాయతీల నిర్వహణకు ఖర్చు విషయంలో ప్రత్యేకాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీం తో భారమంతా ఆయా గ్రామాల కార్యదర్శులపైనే పడుతోంది. దీంతో పా రిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. హరితహారం మొక్కలు ఎండిపోతున్నాయి. నర్సరీల సంరక్షణ సరిగ్గా జరగడం లేదు. అలాగే పలు గ్రామాల్లో వీధీ దీ పాలు కూడా సరిగ్గా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. (తరువాయి 7లో)

బహుజనులను మోసగిస్తున్న ప్రభుత్వం

మాల సంక్షేమ సంఘం నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, తదితర బహుజనులను మోసగిస్తోందని మాల సంక్షేమ సంఘం అధ్య క్షుడు గోశిక మనోజ్ కుమార్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సంఘం ఆధ్వర్యంలో సీసీసీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఆయన మా ట్లాడుతూ, ప్రభుత్వం అన్ని వర్గా ప్రజలను కుల గణన పేరుతో మభ్య పెడుతోందన్నారు. సమస్యలు పక్కదారి పట్టించేందుకే ఇలాంటి నాట కా లు ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విడివిడిగా పోరాడితే నష్టం జరుగుతుందని, కలిసికట్టుగా పోరాటం చేయాలని కోరారు. ఎస్సీ వర్గీ కరణకు వ్యతిరేకంగా ఈ నెల 14న నస్పూర్ పట్టణంలో ఇచ్చిన బంద్ పిలుపును విజయవంతం చేయాలని కోరారు. విద్యాసంస్థలు, వ్యాపార స్తులు, ఉద్యోగులు, అన్నివర్గాల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశా రు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు ఓలపు రవి, జవ్వాజి నం దయ్య, శేఖర్, నరహరి పాల్గొన్నారు.

టైగర్ జోన్‌లో న్యాయాధికారి పర్యటన


కవ్వాల అభయారణ్యంలో పర్యటిస్తున్న నిర్మల్ జిల్లా సివిల్ జడ్జి శ్రీనివాస్

జన్నారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో ఆదివారం నిర్మల్ జిల్లా సివిల్ జడ్జి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా పర్యటించారు. సఫారీ ద్వారా అభయారణ్యంలోని జంతువులు, అడవిని వీక్షించారు. జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. పర్యాటకం పరంగా జరుగుతున్న అభివృద్ధితో పాటు వచ్చి వెళ్లే పర్యాటకుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎఫ్ఆర్‌వో సుష్మారావు, అటవీ సిబ్బంది ఉన్నారు.

ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ విజేత పోలీసు జట్టు



ట్రోఫీతో మందమర్రి పోలీసు జట్టు

కాసిపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కాసిపేట ప్రెస్‌క్లబ్ వర్సెస్ మందమర్రి పోలీసు సర్కిల్ జట్ల మధ్య ఆదివారం కాసిపేట క్రీడా మైదానంలో జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లో మందమర్రి పోలీసు సర్కిల్ జట్టు విజేతగా నిలిచింది. టాస్ గెలిచిన ప్రెస్‌క్లబ్ జట్టు ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన పోలీసు సర్కిల్ జట్టు 12 ఓవర్లలో 106 పరుగులు చేసింది. బరిలోకి దిగిన కాసిపేట ప్రెస్‌క్లబ్ జట్టు 12 ఓవర్లలో 80 పరుగులు చేసి ఓడిపోయింది. మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యా చ్‌గా నిలిచారు. విజేత పోలీసు జట్టుకు నిర్వాహకులు ట్రోఫీని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేట, దేవాపూర్, మందమర్రి, రామకృష్ణపూర్ ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, రాజశేఖర్, పోలీసులు, ప్రెస్ క్లబ్ సభ్యులు శ్రీధర్, రవిరాజ్, రాజేష్, నజీర్, తిరుపతి, సురేష్, దినేష్, రమేష్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై నజర్
- పెండింగ్ బకాయిలపై ప్రత్యేక చర్యలు
- ఇళ్ల వద్దకే వెళుతున్న మున్సిపల్ సిబ్బంది

6

బీజేపీ నాయకుల సంబరాలు 7

వేలాలలో గిరి ప్రదక్షిణ


గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ప్రధాన అర్చకులు సురేష్‌ఆత్మారాం మహారాజ్ , భక్తులు

జైపూర్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేలాల గ్రామంలో గట్టు మల్లన్న గుట్ట మీద ఆదివారం గిరి పదక్షిణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. చిలుకూరి బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు సురేష్‌ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో జరిగిన గిరి ప్రదక్షిణకు భక్తులు తండోప తండాలుగా తరలి వచ్చారు. మంచిర్యాల బస్టాండ్ నుంచి ఆర్టీసీబస్సు సౌకర్యం కల్పించడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఈవో రమేష్, గ్రామస్తులు డేగ నగేష్, చొప్పదండి శ్రీకాంత్, ప్యాగ లక్ష్మణ్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలికి చేయూత


వృద్ధురాలిని కల్వరి కుమార్‌కు అప్పగిస్తున్న వైద్య సిబ్బంది

గర్మిళ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మతి స్థిమితం లేని 70 ఏళ్ల వృద్ధురాలిని మం చిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో గల కల్వరి యువశక్తి అనాథాశ్రమం నిర్వా హకుడు ములుకాల కుమార్ అలియాస్ కల్వరి కుమార్ చేరదీసి ఆదివారం తన ఆశ్ర మానికి తీసుకువెళ్లారు. మంచిర్యాల మార్కెట్‌లో మతి స్థిమితం లేకుండా తిరు గుతు న్న వృద్ధురాలును గమనించిన స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పిం చారు. ఆమె కోసం నాలుగు నెలలుగా ఎవరు రాకపోవడంతో సమాచారం అందుకున్న కల్వరి కుమార్ ఆస్పత్రికి చేరుకుని అక్కడి నుంచి వృద్ధురాలిని అనాథాశ్రమానికి తరలించారు. ఈ సందర్భంగా కల్వరి కుమార్ మాట్లాడుతూ అనాథలు, మతిస్థిమితం లేని వారు ఎవరైనా కనిపిస్తే 9701973636, 9381018678కు సమాచారం అందించాల న్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌నర్సింగ్ ఆఫీసర్ వజ్రాపు మార్గన్ ట్రోజీ, జూని యర్ నర్సింగ్ ఆఫీసర్‌గ్రేసి తదితరులుపాల్గొన్నారు.

అడవులను కాపాడుతూ..

వన్యప్రాణులను సంరక్షిస్తూ..

సత్ఫలితాలు ఇస్తున్న అటవీ అధికారుల చర్యలు


నీల్వాయి అడవిలో నీటి కుంట వద్ద చుక్కల దుప్పి..నెమలి

వేమనపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ అధికారులు వన్య ప్రాణులను సంరక్షించ డంతో పాటు అడవులను కాపాడడంలో తీసుకుంటున్న సత్ఫలితాలు ఇస్తున్నాయి. జిల్లాలోని చెన్నూరు, బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలో కుష్నపల్లి, నీల్వాయి రేంజ్‌లు ఉన్నాయి. వీటి పరిధిలోని అటవీ అధికారులు వన్యప్రాణులను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అడవుల్లోని వన్య ప్రాణులను సంరక్షించేందుకు అధికారులు అక్కడికక్కడ పచ్చిక బయళ్లు ఏర్పాటు చేసి నీటి కుంటలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి కాలం సమీపిస్తుండడంతో ఆ కుంటల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతూ వన్యప్రాణుల దాహార్తిని తీరుస్తున్నారు. అడవుల్లో సోక్‌పిట్స్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం అగ్ని నియంత్రణ చర్యలు సైతం చేపడుతున్నారు. వేసవి కాలం కావడంతో అడవుల్లో అగ్ని ప్రమా దాలు జరిగి చెట్లు, మొక్కలు కాలిపోకుండా సైత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భా గంగా అధికారులు ఫైర్‌లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వన్య ప్రాణులను రక్షించుకునేందుకు కరెంటు వై ర్లు, ఉచ్చులు వేయకుండా ఎప్పటికప్పుడు అటవీ అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అటవీ సమీప గ్రామాల్లో వన్య ప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వన్య ప్రాణులకు హానీ తలపెట్టవద్దని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నీల్వాయి అడవుల్లో నెముళ్లు, కృష్ణ జింకలు, చు క్కల దుప్పులు, ఎలుగుబంట్లు. అడవి కోళ్లు, కుందేళ్లు, నక్కలు, తోడేళ్లు విరివిగా అడవుల్లో సం చరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. వన్య ప్రాణుల సందడి పెరుగుతున్న కొద్ది ఈ ప్రాంతంలో తరుచుగా పెద్దపులులు సైతం సంచరిస్తున్నాయి.

- **వన్యప్రాణులను సంరక్షించేందుకు చర్యలు**

ప్రస్తుతం ఎండాకాలం సమీపించినందున నీల్వాయి రేంజ్ పరిధిలోని అడవుల్లో సంచరిస్తున్న వన్య ప్రాణులను సంరక్షించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా వేటగాళ్లు వన్య ప్రాణులకు హానీ తలపెడితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వన్య ప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేకచర్యలు చేపడుతున్నాం. ప్రజలకు వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్నాం. అడవుల్లో అగ్గి రగల్చకుండా ప్రజలు సహకరించాలి.

-ఎఫ్ఆర్‌వో అప్పల కొండ, నీల్వాయి

వైభవంగా గూడెం సత్యదేవుడి కల్యాణం


గూడెంలో సత్యదేవుడి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, ఆలయ అర్చకులు

దండేపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణస్వామి పుణ్యక్షేత్రంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి సత్యదేవుడి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణో త్సవానికి వేలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా తరలి వచ్చి తిలకించారు. ముందుగా గుట్ట కింద నుంచి స్వామి ఉత్సవ విగ్రహం, రకరకాల పుష్పాలతో సన్నాయి వాయిద్యాలతో ప్రధానలయం వరకు తీసుకవచ్చి ఆలయ అర్చకులు, వేదపండితులు వేదమంత్రోచారనలతో పూజ లు చేశారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ముఖ్య అర్చకులు రఘస్వామి, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, భక్తు లు స్వామి వారికి పట్టువస్త్రాలు మంగళసూత్రం, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

ప్రధానలయంలో స్వామి వారికి పుష్పలకరణ చేసిన అనంతరం కల్యాణ వేదిక వరకు కల్యాణ వేదిక వరకు తీసుకవచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం వేదపండితుల అభిరామచార్యులు, దుద్దిళ్ల నారాయణశర్మ, భరత్‌శర్మ మంత్రోచ్చారణల నడుమ ఆలయ ముఖ్యఅర్చకులు గోవర్ధన రఘస్వామి, అర్చకులు సంపత్‌స్వామి, సమక్షంలో స్వామి వారి కల్యాణ తంతును వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే నడి పెల్లి దివాకర్‌రావు, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎర్రబెల్లి రఘునాథ్, వివిధ ప్రాంతాల ప్రజాప్రతినిధులు, నాయకులు, వేలాది మంది భక్తులు సత్యదేవుడి కల్యాణం తిలకించారు. అనంతరం భక్తులు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో పూలు పండ్లు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. కల్యాణం పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకుట్టుకున్నాయి. దండే పల్లి ఎస్సై తైసోనోద్దీన్, పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాటు చేశారు. .


గూడెంలో స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ సిబ్బంది


కల్యాణం తిలకిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు కుటుంబ సభ్యులు, ప్రజలు

నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు

● ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్



ఆంధ్రజ్యోతి : నర్సరీల్లో మొక్కల పెంపకంపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: నర్సరీల్లో మొక్కల పెంపకానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. మండ లంలోని 28 పంచాయతీల్లో అన్ని చోట్ల నర్సరీలు ఏర్పాటు చేశాం. ప్రతీ నర్సరీలో బ్యాగుల్లో మట్టి నింపి విత్తనాలు నాటేందుకు చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో పారిశుధ్యం మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఎంపీడీవో: మండలంలోని ప్రతీ పంచాయతీలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నాం. రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోకుండా సిబ్బందికి సూచనలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : వైకుంఠధామాల్లో వసతుల కల్పనకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఎంపీడీవో: వైకుంఠధామాల్లో విద్యుత్, నీటి వసతి ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు రాలేదు. నిధులు విడుదల చేస్తే పనులు చేపడుతాం.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి)

ఆస్తి పన్ను వసూళ్లపై నజర్

● పెండింగ్ బకాయిలపై ప్రత్యేక చర్యలు

● ఇళ్ల వద్దకే వెళుతున్న మున్సిపల్ సిబ్బంది

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో పన్ను వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. మార్చి నెలాఖరులోగా వందశాతం పూర్తి చేసేందుకు సిబ్బంది ఇళ్ల వద్దకే వెళుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పట్టణ అభివృద్ధికి పన్నులు చెల్లించాలని కోరుతున్నారు.



కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూలు చేయడంపై అధికారులు దృష్టి సారించారు. కమిషనర్ అంజయ్య ఆధ్వర్యంలో స్పెషల్ టాస్క్ ఫోర్సు టీం ఏర్పాటు చేశారు. ఇందులో వార్డు అధికారితో పాటు ఆస్తి పన్ను వసూలు చేసేందుకు సిబ్బందిని నియమించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వార్డుల్లో తిరిగి వసూలు చేస్తున్నారు. సాయంత్రం ఎంత మేర వచ్చిందనే అంశాలను కమిషనర్ అంజయ్య స్వయంగా సిబ్బందితో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి ఉన్నతాధికారుకు సమాచారం ఇచ్చి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

● రూ.3.92 కోట్లు లక్ష్యం..

మున్సిపాలిటీలో దుకాణాలు, ఇళ్లు, 14,000 ఉన్నాయి. వీటికి సంబంధించిన ఆస్తి పన్ను రూ.3.92 కోట్లు వసూలు చేయాల్సిన లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించారు. గత నెల రోజులుగా వార్డు వారీగా సిబ్బంది తిరిగి ఇప్పటి వరకు రూ.1.70 కోట్ల మేర వసూలు చేశారు. ఇంకా రూ.2.22 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. పది రోజుల క్రితం మున్సిపల్ ప్రత్యేక అధికారి దీపక్ తివారి ఆధ్వర్యంలో ఆస్తి పన్ను వసూలు చేసే విషయంలో పక్కాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈమేరకు వార్డుల వారీగా మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మేనేజర్ క్రాంతి, రెవెన్యూ అధికారి రాజేందర్‌తో పాటు వార్డు అధికారులకు కీలక బాధ్యతలను అప్పగించారు. ఉదయం నుంచి వార్డుల వారీగా ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. స్వయంగా కమిషనర్ అంజయ్య వార్డుల్లో తిరిగి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. మార్కెట్ లో దుకాణాదారులను కలిసి అవగాహన కల్పిస్తున్నారు. మొండి బకాయిలు ఉంటే ఆస్తులను జప్తు చేసేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేశారు. మార్చి 31 కల్లా పూర్తిగా ఆస్తిపన్ను కట్టాలని సూచిస్తున్నారు. వీటితో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి ఆస్తి పన్ను రూ.20లక్షల మేర ఉండడంతో డిమాండ్ నోటీసులను పంపించారు. మొండి బకాయిలు ఉన్న వారు కోర్టును ఆశ్రయించకుండా ముందస్తుగానే జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సర్‌సిల్క్ మిల్లు నుంచి రావాల్సిన రూ.4 కోట్ల ఆస్తి పన్ను వసూలుకు ముందుకు సాగుతున్నారు.

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలి..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలోని ప్రజలు సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలి. పన్నులు పూర్తి స్థాయిలో చెల్లిస్తే అభివృద్ధి పనులు కొనసాగుతాయి. సిబ్బందితో ఇంటి వద్దకే వసూలు చేసేందుకు వస్తున్నారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి. అందుబాటులో లేని వారు ఆన్‌లైన్ ద్వారా కూడా చెల్లించవచ్చు.

- అంజయ్య, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్



వార్డుల్లో ఆస్తి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య

ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

కౌటాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బొమ్మకంటి స్ఫూర్తి(16) అనే విద్యార్థిని శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, కౌటాల ఎస్సై మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మధ్యాహ్నం కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ పాఠశాలలో నవోదయ పరీక్ష రాసి ఇంటికి వచ్చింది. అనంతరం మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలకు వెళ్లింది. తిరిగి ఏడున్నర కు స్ఫూర్తిని తండ్రి సదానందం ఇంటికి తీసుకు వచ్చాడు. కూతురిని ఇంట్లో దింపిన అతను బయటకు వెళ్లాడు. స్టడీ మెటీరియల్ ఫోన్‌లో పీడీఎఫ్ ఉందని ఫోన్ ఇవ్వాలని తల్లి రమాదేవిని అడిగింది. ఫోన్ ఇస్తే గేమ్స్ ఆడి సమయం వృథా చేస్తావని తల్లి చెప్పింది. మెటీరియల్ జిరాక్స్ కాఫీ తీసుకు వస్తానని ఆమె బయటకు వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన స్ఫూర్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో చీరెతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. జిరాక్స్ కాపీతో తల్లి రమాదేవి ఇంటికి వచ్చింది. ఫ్యాన్‌కు వేలాడుతున్న బిడ్డను చూసి వెంటనే తండ్రి సదానందంకు కాల్ చేసింది. అతడు వచ్చి స్ఫూర్తిని కిందికి దింపి వెంటనే కౌటాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. అక్కడ నుంచి సిర్పూర్(టి) ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్ఫూర్తి తండ్రి సదానందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

విలేకరుల ముసుగులో అక్రమ దందా

● ఏడుగురిపై కేసు నమోదు

వేమనపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): విలేకరుల ముసుగులో అక్రమ దందాలకు పాల్పడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోదావరిఖనికి చెందిన జక్కుల శ్రీధర్, మొగిలి అనిల్ అనే వ్యక్తులు ఇటీవల వేమనపల్లి మండలంలోని సుంపుటం గ్రామంలో ఆరు ఎద్దులను కొనుగోలు చేశారు. ఎద్దులను అమ్మడానికి వాహనంలో ఆదివారం తెల్లవారుజామున పెద్దపల్లికి వెళ్తుండగా వేమనపల్లి వైన్‌షాపు దగ్గర చొప్పదండి జనార్ధన్, తుంగ రమేష్, మాసాని రమేష్, తోడేటి సంతోష్, జీలపెల్లి పోశం, తగరం వెంకటేష్, దొబ్బల విష్ణులు అడ్డుకున్నారు. తాము విలేకరులమని పరిమితికి మించి ఎద్దులను తీసుకువెళ్తున్నారని, అలాగే తాముమూగ జీవాల సంఘం నాయకులమని, వాహనాన్ని సీజ్ చేసి జైలుకు పంపిస్తామని, డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. దీంతో భయపడిపోయిన శ్రీధర్, అనిల్‌లు కొంత నగదును అందజేశారు. ఇంకా పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏడుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గతంలో కూడా ఈ ఏడుగురు వ్యక్తులు విలేకరులమని చెప్పుకుంటూ పశువులను తరలించే వాహనాలను వెంబడించి డబ్బులు డిమాండ్ చేస్తూ అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు.

దాడికి పాల్పడిన ముగ్గురి రిమాండ్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ తెలిపారు. ఆదివారం తాళ్లగురిజాల పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న బెల్లంపల్లిలోని ఎస్‌ఆర్‌ఆర్ బార్‌లో బండారి వంశీ అనే వ్యక్తిపై బీరు సీసాలతో కొట్టి మూకుమ్మడిగా దాడి చేసిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. దాడి చేసిన అల్లి సాగర్, రత్నం సోమయ్య, మామిడి అన్నమయ్యలను ఆదివారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచామన్నారు.

అటవీ ప్రాంతంలోకి పెద్దపులి



బుగ్గ శివారులో పెద్దపులి పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

కాసిపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కాసిపేట మండలంలోని వరిపేటలో తిరిగిన పెద్దపులి ఎట్టకేలకు ఆదివారం బుగ్గగూడెం, కర్నెల గట్టు, బుగ్గ దేవాలయం మీదుగా గోలేటి, మాదారం అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు అటవీ శాఖ అధికారులు పులి పాద ముద్రల ద్వారా గుర్తించారు. నాలుగు రోజుల నుంచి బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల అటవీ సరిహద్దు ప్రాంతాల్లో పెద్దపులి సంచరిస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేసింది. ఇంత వరకు పెద్దపులి అడవి పందులను మాత్రమే వేటాడింది. మనుషులకు ఎలాంటి హానీ చేయకపోవడంతో అటవీ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పెద్దపులి ఆదివారం అంకుశం, చౌటపల్లి అటవీ శివారులో సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే పెద్దపులికి ఎలాంటి హానీ తలపెట్టవద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి.. నలుగురి అరెస్టు

నెన్నెల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కుశ్నపల్లి గ్రామ శివారులోని పత్తి చేలల్లోని పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసినట్టు ఎస్సై ప్రసాద్ తెలిపారు. జూదమాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, ఒకరు పరారయ్యారని చెప్పారు. వారి నుంచి రూ. ఆరువేల నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పీఆర్టీయూటీఎస్ జెండా ఆవిష్కరణ



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం పీఆర్టీయూ టీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘ భవనంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, అనీల్‌కుమార్ మాట్లాడారు. పీఆర్టీయూటీఎస్ నిరంతరం ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతుందని చెప్పారు. సభ్యులను కలుపుకుంటూ ప్రభుత్వం దృష్టికి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుటున్నామని తెలిపారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నరసింహచారి, ఉదయ్‌బాబు, రవి, ప్రకాష్, గోరొ ంంగ్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, సత్యనారాయణ, హనుమంతు, జ్ఞానేశ్వర్, రాహుల్, సోనేరావు, భరత్, కవిత, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్ట్

● ఐదు ద్విచక్ర వాహనాలు, కారు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన డీఎస్పీ రఘుచందర్



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

జగిత్యాల రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో వరుసగా చోరీలకు పాల్పడుతున్న ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను ఆదివారం జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు గ్రామా నికి చెందిన జక్కుల గోపాల్, సింగంరాజు, నేరెళ్ల నరేష్, సంపతి కుమారస్వామి, బుర్రరాజేందర్‌లు జల్సాలకు అలవాటు పడి ఒక ముఠాగా ఏర్పడ్డారు. జక్కుల గోపాల్‌కు చెందిన ఎర్టిగా కారులో రాత్రి సమయాల్లో తిరుగుతూ ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను దొంగిలిస్తున్నారు. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని పెంబట్ల గ్రామంలో గత డిసెంబరులో బైక్ దొంగిలించారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామంలో మరో బైక్‌ను, చిన్న బెల్లాల్ గ్రామంలోని ఇంటి ముందు పార్కు చేసిన మరో బైక్‌ను, జగిత్యాల మండలం తిప్పన్నపేట, దండేపల్లి మండలంలోని ద్వారకానగర్‌లో ఇంటిముందర పార్కు చేసిన రెండు బైక్‌లను దొంగతనానికి పాల్ప డ్డారు. దొంగిలించిన బైక్‌లను తమ ఇంటి వద్ద దాచి పెట్టినట్లు నింది తులు నేరాన్ని ఒప్పుకున్నారు. జగిత్యాల మండలం తిప్పన్నపేట గ్రామానికి చెందిన భారతపు పెద్దిరాజం బైక్ అపహరించడంతో జగిత్యాల రూరల్ స్టేషన్‌లో బాధితుడు జనవరిలో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తనిఖీలు చేపట్టారు. తిప్పన్నపేట గ్రామ శివారులో కారులో వస్తున్న ఐదుగురు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు పట్టుబడ్డారు. నింది తులను పట్టుకున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సధాకర్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, గంగాధర్, రాహుల్, ఉమర్, మోహన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

అధ్వాన దారులు.. ఎన్నాళ్లీ అవస్థలు



దండేపల్లిలో ధ్వంసమైన రోడ్డు

దండేపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రంలో వేసిన అంతర్గత దారులు అధ్వానంగా మారాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దండేపల్లిలో ఐకేపీ కార్యాలయం నుంచి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వేళ్లే సీసీ రోడ్డు ఇప్పుడు పూర్తిగా ధ్వంసమైంది. పలు చోట్ల పగుళ్లు తేలింది. దీనికి తోడు దండేపల్లి మూడో వార్డులో సీసీ రోడ్డు అనవాళ్లు లేకుండా పోయింది. ఈ రోడ్డు మీదుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మూడోవార్డులో రోడ్డుపై తేలిన రాళ్లు



సొంత ఇంటి కలను సాకారం చేస్తాం



జనక్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు శక్తి వంచన లేకుండా తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్‌ప్రసాద్ అన్నారు. ఆదివారం మందమర్రి ఏరియా ఐఎన్‌టీ యూసీ నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘం వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న కార్మికుల సేవలు మరువలేనివన్నారు. కార్మికులకు నాణ్యమైన రక్షణ , ఉత్పత్తి పరికరాలు అందించాలన్నారు. ఇన్‌కంటాక్స్‌తో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కేంద్రం రూ. 12 లక్షల వరకు టాక్స్ ఉండదని చెప్పడం వెనక మతలబు ఉందని తెలిపారు. కార్మికులకు పూర్తిగా ఇన్‌కంటాక్స్‌రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మారుపేర్ల సమస్య, ఇతర సమస్యలను సీఎంకు విన్నవిస్తామని తెలిపారు. అనంతరం జనక్‌ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షు డు దేవి భూమ య్య, కేంద్ర కమిటీ జాయింట్ సెక్రటరీ జగన్నాధచారి, రామ్‌శెట్టి నరేందర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పరిరక్షణకు ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ పరిరక్షణకు ఉద్యమిస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి సీతారామయ్య అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఇప్పటి వరకు ఏడాది గడిచినా కార్మిక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. స్ట్రక్చర్ సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించాల్సి ఉండగా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ పేరుతో వాయిదా వేయడం దారుణమన్నారు. ప్రభుత్వ పథకాల అమలు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు అడ్డురాని కోడ్ కార్మికుల సమస్య పరిష్కా రానికి అడ్డుపడడం ఏంటని ఆయన ప్రశ్నించారు. అలాగే సింగరేణిలో పూర్థిస్థాయిలో డైరెక్టర్లు లేకపోవడం వల్ల పరిపాలన గాడి తప్పుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈనాటి ప్రభుత్వం కూడా వ్యవహరించడం సరికాదన్నారు. సంస్థకు రావాల్సిన 33 కోట్ల రూపాయల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఇదేమాదిరిగా వ్యవహారిస్తూ పోతే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, నాగభూషణం, మల్లేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శులు మురళీచౌదరి, సారయ్య, నవీన్ రెడ్డి, ఆకుల లక్ష్మణ్, సందీప్, కుమారస్వామి, సంఘం సదానందం, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహం నింపిన యువ కార్మికుల క్రికెట్ పోటీలు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఎస్‌ఆర్‌పీ 3 గనిలో పనిచేస్తున్న యువకార్మికులకు ఆటవిడుపుగా ఆదివారం నిర్వహించిన క్రికెట్ లీగ్ మ్యాచ్ వారిలో ఉత్సాహం నింపింది. పోటీలను ఇన్‌చార్జి మేనేజర్ మహేందర్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ఐదు జట్లు పాల్గొనగా, చివరకు సీ రిలే జట్టు, జనరల్ షిఫ్ట్ జట్టు ఫైనల్‌కు చేరాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ తీసుకున్న సీ రిలే జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 71 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేసిన జనరల్ షిఫ్ట్ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 72 పరుగులు చేసి విజయం సాధించింది. ఆయా జట్లను యూని యన్లకు అతీ తంగా నాయకులు అభినందించారు. సోమవారం ఉదయం మొదటిషిఫ్ట్‌లో విజేతలకు బహుమతులు అందిస్తామని నిర్వహణ కమిటీ బాధ్యులు శశిధర్, వణదీప్, వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌పీ 3 అండర్ మేనేజర్లు అరుణ్ కుమార్, మధుసూదన్, మల్లికార్జున్, రామకృష్ణ, పిట్ కార్యదర్శులు ఏఐటీయూసీ నాయకులు, బీఎంఎస్ నాయకుడు భీమన్న తదితరులు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో ఏబీకేఎంఎస్ మహాసభలు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మ టహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఈ నెల 12, 13 తేదీల్లో అఖిల భారతీయ ఖదాన్ మజ్దూర్ సంఘ్(ఏబీకేఎంఎస్-బీఎంఎస్) మహాసభలు నిర్వహించనున్నట్లు బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి మహాసభలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

'ప్రత్యేక' పాలన..అస్తవ్యస్తం


భీమారంలో మురికి కాలువలో నిల్వ ఉన్న మురుగు

(5వ పేజీ తరువాయి)

జైపూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యం లోపించి వీధులన్నీ అస్తవ్యస్తంగా మారాయి. ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటు పడిపోయింది. నిధులు లేక పారిశుధ్య పనులను చేయడం లేదు. మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. మండలంలోని 20 గ్రామపంచాయతీల్లో అదే పరిస్థితి కనిపిస్తోంది.

● నిలిచిన అభివృద్ధి..

కోటపల్లి : గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన గాడి తప్పింది. ఏడాదిగా ప్రత్యేక అధికారుల పాలన సాగుతుండగా సంబంధిత యంత్రాంగం పట్టించుకోకపోవడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయి పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఆదివారం కోటపల్లి మండలంలోని శెట్‌పల్లి, సర్వాయిపేట గ్రామాలను ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా పలు అంశాలు బయట పడ్డాయి. సర్వాయిపేట గ్రామంలోని బంజారవాడ, యాదవ వాడల్లో మురుగు కాలువల పూడిక తీత లేక నీరు రోడ్డుపై జనావాసాల్లోకి చేరుతోంది. ఫలితంగా దోమలు వ్యాపిస్తున్నాయి. పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల నిర్వహణ సరిగ్గా లేదు. శ్మశాన వాటిక వద్ద బోరులోని మోటారును, సోలార్ లైట్ ప్లేట్‌ను సైతం ఎవరో ఎత్తుకెళ్లారు. శెట్‌పల్లిలో మురుగు కాలువలు నిండిపోయి పిచ్చి మొక్కలు మొలకెత్తాయి. తాగునీటి వనరుల వద్ద నీరు లీక్ కావడంతో బురద ఏర్పడి దుర్గంధం వ్యాపిస్తోంది.

హాజీపూర్ : సర్పంచుల పదవీ కాలం పూర్తయినప్పటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుండగా గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. నిధులు రాక అభివృద్ధి నిలిచిపోయింది. మండలంలో 17 గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారులను నియమించారు. ముల్కల్ల గ్రామంలో డ్రైనేజీలు చెత్తా, చెదారంతో నిండిపోయాయి. కొన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయి. కనీసం మరమ్మత్తులు కూడా చేయించడం లేదు.

దండేపల్లి: గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనతో అటు నిధులు రాక ఇటు అభివృద్ధి నిలిచిపోయాయి. దండేపల్లి మండలంలో 31 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనే సాగుతోంది. మండలంలోని మామిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఊట్ల గిరిజన గ్రామానికి వెళ్లే మెటల్ రోడ్డుంతా దెబ్బతిన్ని కంకర తేలింది. మండలంలోని పలు గ్రామాల్లో సైడ్ డ్రెయినేజీలు శిథిలావస్థకు చేరాయి. మరికొన్నిచోట్ల డ్రైనేజీలో పూడికతీత తీయకపోవడంతో మురికి నీరంత రోడ్డెక్కి పారుతోంది. అసలే ఎండకాలం రాబోతున్న నేపథ్యంలో ఇప్పటికి కొన్ని గ్రామాల్లో చెడిపోయిన బోర్‌వెల్ పంపులు మరమ్మతులకు నోచుకోవడం లేదు.

భీమారం: మండలంలోని 11 గ్రామంపచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్యం లోపించింది. వీధులన్నీ అపరిశుభ్రంగా మారాయి. నాలల్లో పేరుకుపోయిన చెత్తా, చెదారంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. గ్రామాలను ప్రత్యేక అధికారులు సందర్శించకపోవడంతో పాలన అస్తవ్యస్తంగా మారింది. పనులు చేసిన సర్పంచులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అదికారులు స్పందించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ర్వహణ భారంగా మారింది. దీంతో ప్రధాన కూడళ్ల వద్ద చెత్త పేరుకుపోయి కంపు కొడుతోంది. వేసవి కాలం మొదలు కావడంతో నీటి కటకట ఏర్పడింది. ప్రత్యేక పాలన ప్రజలకు ఇబ్బందిగా మారిందని పలువురు పేర్కొంటున్నారు.

కన్నెపల్లి : ప్రత్యేక అధికారుల పాలనలో మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. మురుగు కాలువల్లో పూడిక తీయకపోవడంతో చెత్తా, చెదారం నిండి మురుగు నీరు రోడ్లపై పారుతోంది. పంచాయతీలకు నిధులు లేక పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో రోడ్లపై ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయింది. గ్రామాల్లోని చేతి పంపుల వద్ద అపరిశుభ్రంగా మారింది. పైపులైన్ల లీకేజీతో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదు.

జన్నారం : గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలనలో అభివృద్ధి కొనసాగడం లేదు. ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించకపోవడంతో పారిశుధ్యం లోపించింది. ఆదివాసీ గ్రామాలైన అల్లినగర్, దొంగపల్లి, మల్యాలతో పాటు పలు గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు, పారిశుధ్య పనులు చేపట్టడం లేదు. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. మురుగు కాలువల్లో పూడిక తీతలు లేకపోవడంతో కంపు కొడుతున్నాయి. దీంతో ప్రజలు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు.

పల్లె పాలన అధ్వానం..

నెన్నెల : మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనలో పనులు ముందుకు సాగడం లేదు. పారిశుధ్య పనులు అంతంత మాత్రంగా కొనసాగుతున్నాయి. చెత్త సేకరించే ట్రాక్టర్ల మెయింటనెన్స్ కోసం నిధులు లేక కొన్ని గ్రామాల్లో మూలన పడ్డాయి. క్లోరినేషన్ పనులు చేపట్టడం లేదు. స్ట్రీట్ లైట్లు వెలగక రాత్రి పూట జనాలు బయటకి రావడం లేదు. మండలం లోని కుశ్నపల్లి, కోనంపేట గ్రామ పంచాయతీలను ఆదివారం ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా సమస్యలు కొట్టొచ్చినట్టు కానవచ్చాయి. కోనంపేటలోని మంచి నీటి పథకం బోరు వద్ద పిచ్చిమొక్కలు, బురదతో అపరిశుభ్రంగా ఉంది. అక్కడే ఏర్పాటు చేసిన నల్లా తో ఎస్టీ వాడ ప్రజలందరూ తాగునీ టిని తీసుకెల్తారు. నల్లాకు ఆన్‌ఆఫ్ లేక పోవడంతో 24 గంటలు నీరు వృధాగా పోతోంది. దీంతో ఆ ప్రాం తమంతా బురదమయంగా మారింది. గ్రామంలో మురికి కాలువల నిర్వహన లేదు. కుశ్నపల్లిలో ట్రాక్టర్ చెడిపోవడంతో చెత్తను తీసుకు వెళ్లడం లేదు. ఎస్సీ వాడలోని బోర్ వెల్‌కు ప్లాట్ ఫాం లేక పోవడంతో దాని చుట్టు మురికి నీరు చేరి అపరిశుభ్రంగా ఉంది.


కుశ్నపల్లిలో బోరు వద్ద మురికి నీరు

● నిధులు లేక..

కాసిపేట : మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో పారిశుధ్యం లోపించింది. మురికి కాలువల్లో చెత్తా, చెదారం పేరుకుపోయి మురుగునీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తుంది. నిధులు లేక పారిశుధ్య పనులు కొనసాగడం లేదు. చెడిపోయిన చేతి పంపులకు మరమ్మతులు చేయక తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీల్లో నిధులు లేక ట్రాక్టర్ల ని


వేమనపల్లిలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

మందమర్రిరూరల్ : మండలంలోని 10 గ్రామాల్లో సర్పంచులు లేక పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు చూడకపోవడంతో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదన్నారు. గ్రామాల్లో డ్రైనేజీలు సక్రమంగా లేక రోడ్లపై మురుగునీరు పారుతుంది. గ్రామాల్లో అభివృద్ధి జరగడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు.

వేమనపల్లి: వేమనపల్లి మండలంలో అధికారుల నిర్లక్ష్యంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. వీధులన్నీ అపరిశుభ్రంగా తయారయ్యాయి. మురికి నీటి కాలువల్లో చెత్త పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో ఈగలు, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని వేమనపల్లి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 14 పంచాయతీలు ఉన్నా ఏ గ్రామంలో చూసినా పారిశుధ్యం లోపించి రోడ్లపై చెత్తా, చెదారం మురుగునీరు దర్శనమిస్తుంది. పంచాయతీలకు నిధులు రాకపోవడం ప్రత్యేకాధికారులు గ్రామాలను పట్టించుకో కపోవడంతో పారిశుధ్యం గురించి పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు పేర్కొంటున్నారు.

వెంటాడుతున్న సిబ్బంది కొరత

లక్షెట్టిపేట రూరల్: లక్షెట్టిపేట మండలంలోని ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యల పరిష్కారం పూర్తిగా స్థంభించింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులు ఇన్‌చార్జిలుగా ఉండటంతో పాటు వారి పర్యవేక్షణలోపం వల్ల గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదు. మండలంలో 18 గ్రామ పంచాయతీలకు కేవలం ఏడుగురు మండల స్థాయి అధికారులను మాత్రమే ప్రత్యేక అధికారులుగా కొనసాగుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం ..

తాండూర్ : పంచాయతీ అధికారుల ప్రత్యేక పాలనలో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకు పోయింది. పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. పారిశుధ్య సిబ్బంది, పంచాయతీ అధికారులు పట్టించుకో కపోవడంతో వీధులన్నీ అపరిశుభ్రంగా మారుతున్నాయి. పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించకపోవడంతో తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. ఐబీ కేంద్రంలో బస్సులు ఆగే చోట చెత్త ఉండడంతో ప్రయా ణికులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 15 గ్రామపంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ సరి గ్గా లేక పరిస్థితి అధ్వానంగా మారుతోంది. తాం డూర్ మండల కేంద్రం, అచ్చలాపూర్, రేచిని, గోపా ల్ నగర్‌లలో వారానికి రెండు రోజు కూడా మిష న్‌భగీరథ నీరు రావడం లేదు.


రేచిని అండర్‌బ్రిడ్జి వద్ద ఉన్న చెత్తకుప్పలు

పారిశుధ్య పనులను చేపట్టాలి..



పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు గ్రామాల్లోని సమస్యలను పట్టించుకోవడం లేదు. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సేకరించిన చెత్తను కూడా డంపింగ్‌యార్డుకు తరలించకుండా రోడ్డు పక్కన, చెరువు పక్కన వేస్తున్నారు. చుట్టు పక్కల వారికి చెడు వాసన వచ్చి ఇబ్బంది పడుతున్నారు. పనులను ముమ్మరంగా చేపట్టాలి.

- బండి పోచం, తాండూర్ వాసి

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ

కన్నెపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను నియంత్రించవచ్చని కన్నెపల్లి ఎస్ఐ గంగారాం పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కన్నెపల్లిలోని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. అలాగే టేకులపల్లి, జన్కాపూర్, జజ్జరవెల్లి గ్రామాల్లో సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో నేరాలు చేయడానికి భయపడతారని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకుల పరిశీలన

భీమారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వాటర్ ట్యాంకులను ఆదివారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజమొగిలి పరిశీలించారు. గ్రామాల్లోని ప్రజలకు మిషన్ భగీరత నీటిని సక్రమంగా సరఫరా చేయాలని, పైపులైన్లు లీకేజీలు కాకుండా చూడాలన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించేలా చూడాలని పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు. బీజేపీ నాయకులు పట్టి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రధాని మోదీ హయాంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంద న్నారు. ప్రపంచ దేశాలు దేశం వైపు చూస్తున్నాయని పేర్కొ న్నారు. నాయకులు రాచర్ల సంతోష్, మధు, శ్రావణ్, సుమలత, ప్రశాంత్, రాము, కళావతి, లావణ్య, శ్రీనివాస్, స్వామిగౌడ్, షేక్‌బాబా, శంకర్, చంద్రమౌళి, ప్రీతం పాల్గొన్నారు.

జైపూర్ : ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలిచిన సందర్భంగా మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు దూట రాజ్‌కుమార్, చెన్నూరు నియోజకవర్గ అసెంబ్లీ నాయకులు దుర్గం అశోక్ మాట్లాడుతూ భారతదేశం ప్రధాని మోదీ హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఢిల్లీలో 12 ఏండ్ల ఆమ్ ఆద్మీ పార్టీ పాలనకు అక్కడి ప్రజలు చరమగీతం పాడారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేముల రమేష్‌గౌడ్, పల్లికొండ వెంకటేష్, మంత్రి రామన్న, రామగిరి రాము పాల్గొన్నారు.



బెల్లంపల్లి, జైపూర్‌లో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

ఢిల్లీలో ధర్నాకు తరలిన ఎల్‌ఐసీ ఏజెంట్లు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 11న ఢిల్లీలోని పార్లమెంట్ ముందు జరిగే మహా ధర్నాకు మంచిర్యాలలోని ఎల్‌ఐసీ ఏజెంట్లు ఆదివారం ఢిల్లీకి బయలుదేరివెళ్లారు. ఏజెంట్లు మాట్లాడుతూ బీమా ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలని, బీమారంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితి పెంపు విరమిం చుకోవాలని డిమాండ్ చేశారు. మంచిర్యాల బ్రాంచ్ బాధ్యులు తిరుపతి, మహేష్, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య, వేణు, స్వామి ఉన్నారు.

అవార్డులు అందుకున్న లయన్స్ క్లబ్ సభ్యులు



అవార్డులతో క్లబ్ సభ్యులు

గర్మిళ్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని శుభం కన్వన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన లైన్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 320జీ రీజియన్ ప్రాంతీయ సదస్సులో సేవా కార్యక్రమాలు చేసినందుకు గాను మంచిర్యాల లైన్స్ క్లబ్ సభ్యులు అవార్డులను అందుకున్నారు. ఫస్ట్ బెస్ట్ ప్రెసిడెంట్‌గా బాల మోహన్, రీజియన్‌లో బెస్టు సర్వీసు ఆక్టివిటీస్‌పర్సన్‌గా మధుసూదన్‌రెడ్డి, బెస్ట్ ట్రెజరర్‌గా వెంకటేశ్వర్‌రావు, బెస్ట్ ఐ క్యాంపు, క్యాలెండర్ ఈవెంట్స్, హెల్త్ క్యాంప్, బ్యానర్ ప్రజంటేషన్‌లుగా సభ్యులుగా చంద్రదత్, రామాంజనేయులు, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, డేగ బాబు, హన్మంతరావు, రాజేశ్వర్‌రావు, సురేందర్, చంద్రమౌళిలు అవార్డులు అందుకున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


బెల్లంపల్లిలో సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీఎస్ఐ తెలుగు మీడియం 1990-91 పదవ తరగతి బ్యాచ్‌పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలుకురించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు సుభాకర్, ప్రసాద్, రజిని, రేచల్, శకుంతల, భాస్కర్, సత్యనారాయణ, రవీందర్, ఇమానుయిల్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రేణికుంట్ల ప్రవీణ్, విష్ణు, చంద్రమొగిలి, వెంకటేష్, విఠల్, శంకర్‌బాబు, బానేష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్ : పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల 1999-2000 బ్యాచ్‌పదవ తరగతి విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పాఠశాల ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. 25 సంవత్సరాల తరువాత పాత మిత్రులందరు కలుసుకోవడంతో ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. పాత మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకుని సంతోషంగా గడిపారు. విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న సరస్వతీ శిశుమందిర్ పూర్వ విద్యార్థులు

అపురూప శిలాజ సంపద అన్యాక్రాంతం


శిలాజాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వేమనపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి మండలం సుంపుటం గ్రామ శివారు ప్రాంతం నుంచి ప్రవహిస్తున్న ప్రాణహిత నది ప్రాంతంలోని కొన్ని వేల సంవత్సరాల క్రితం నుంచి ఉన్న అపురూపమైన శిలాజ సంపదను కొందరు అక్రమంగా పగులగొట్టి మత్తడి వాగు అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి వాడుతున్నారని బీజేపీ నాయకులు మండిపడ్డారు. ఆదివారం వేమనపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు ఏట మధుకర్, నాయకులు మత్తడి వాగు వద్దకు వెళ్లి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సుంపుటం నది ప్రాంతంలో కొన్ని వందల సంవత్సరాల నాటి శిలజ సంపదను అక్రమంగా తరలించిన అప్రోచ్‌రోడ్డు గుత్తేదారుపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అప్రోచ్ రోడ్డు రివిట్‌మెంట్ కోసం అరుదైన లాజాలను పగులగొట్టి ట్రాక్టర్ల ద్వారా వంతెన వద్దకు తీసుకువచ్చి వాడుతున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఎనుముల వెంకటేష్, నాయకులు కంపెల అజయ్, కోయిల స్వామి పాల్గొన్నారు.

క్రీడలు స్నేహ సంబంధాన్ని పెంపొందిస్తాయి



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఏసీపీ రవికుమార్

కాసిపేట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు స్నేహ సంబంధాన్ని పెంపొందిస్తాయని, క్రీడలతో శారీరక ధృఢత్వం మానసిక ఉల్లాసం లభిస్తుందని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. కాసిపేట మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న కేఎంపీఎల్ సీజన్ 3 క్రికెట్ టోర్నీ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఈ ఏసీపీ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని, నైపుణ్యం పెంచుకునిజాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. నేటి యువత చెడు వ్యసనాలకు బానిసై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు.

విజేత సోల్జర్ బ్రేవ్ హార్ట్ జట్టు

గత నెల 19న ప్రారంబమైన కేఎంపీఎల్ (కాసిపేట మండల్ ప్రీమియర్ లీగ్) సీజన్ 3 విజేతగా సోల్జర్ బ్రేవ్ హార్ట్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం కాసిపేట క్రీడా మైదానంలో రాయల్ చాలెంజర్స్, సోల్జర్ బ్రేవ్ హార్ట్ జట్టు ఫైనల్‌లో తలపడగా సోల్జర్ బ్రేవ్ హార్ట్ విజయం సాధించింది. విజేత జట్టుకు రూ. 50 వేల నగదు, ట్రోఫీ, రన్నర్ జట్టుకు రూ. 30 వేల నగదు, ట్రోఫీని ఏసీపీ రవికుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అప్పాల శేఖర్, చింతల సాగర్, చంద్రమౌళి, నారాయణ, రమేష్, సాయికుమార్, నర్సింగం, నిర్వహకులు చిందం శ్రావణ్, రామసాని రాజు, దాసరి శంకర్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

వండర్‌బుక్ రికార్డులో మందమర్రి క్రీడాకారులు


సర్టిఫికెట్లతో క్రీడాకారులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ రాష్ట్ర స్థాయి యోగాసాన శత సహస్ర సూర్య నమస్కారాల పోటీల్లో మందమర్రికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబర్చి వండర్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించారు. రెండు రోజుల క్రితం సిద్దిపేటలో నిర్వహించిన పోటీల్లో మందమర్రికి చెందిన గోదారి రామ్మోహన్, దుర్గం రజిత, గోదారి అద్వైత ప్రతిభ కనబర్చి రికార్డు నెలకొల్పారన్నారు. 25సంవత్సరాల కేటగిరిలో గోదారి రామ్మోహన్ 333 రౌండ్లు, దుర్గం రజిత, 157 రౌండ్లు, అద్వైత 110 రౌండ్లతో సూర్య నమస్కారాలు ప్రదర్శించారు. దీంతో నిర్వహకులు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈసందర్భంగా క్రీడాకారులను మందమర్రి యోగా సబ్యులు అభినందించారు.

ఆరోగ్య కేంద్రం అందుబాటులో నిర్మించాలి


కన్నెపల్లిలో రాస్తారోకో చేస్తున్న ప్రజలు

కన్నెపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ప్రజలకు అందుబాటులో కన్నెపల్లి మండల కేంద్రంలోనే నిర్మించాలని ప్రజలు పేర్కొన్నారు. ఆదివారం కన్నెపల్లి మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులో నిర్మించకుండా దూరంగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిర్మించడం సరైంది కాదన్నారు. ఆరోగ్య కేంద్రాన్ని గ్రామపంచాయతీ పక్కన గల ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తే ప్రజలందరికి అందుబాటులో ఉంటుందన్నారు. అందుబాటులు ఆరోగ్యకేంద్రం నిర్మించకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ క్యాలెండర్ల విడుదల

భీమారం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆదివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. స్థానిక ఎమ్మెల్యే నిరుద్యోగ యువతకు పవర్‌ప్లాంటులో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి ఒక్కరికి కూడా ఇప్పించలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో పశు సంవర్థక శాఖా అధికారులతో కలిసి వాంకిడి ఎస్సై ప్రశాంత్ ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. ఎస్సై ప్రశాంత్ మాట్లాడుతూ ఏవీఎన్ ఇన్ఫుఎంజా వైరజ్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో తనిఖీ చేశామని చెప్పారు. మహారాష్ట్ర నుంచి వచ్చే పౌల్ట్రీ వాహనాలను నిషేధించిన నేపథ్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జవెల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యంను ఎస్సై ఇస్లావత్ నరేష్ ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారని ముందస్తు సమాచారంతో దాడులు నిర్వహించారు. ఈ మేరకు కర్జవెల్లి గ్రామానికి చెందిన డోకే రుషి వద్ద ఆరు సంచుల్లో ఉన్న మూడు క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నరేష్ మాట్లాడుతూ రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినా, ఇతర ప్రాంతల్లో అమ్మకానికి తీసుకెళుతున్నా స్వాధీనం చేసుకుంటామని చెప్పారు. కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పీఆర్టీయూటీఎస్ అభ్యర్థిని గెలిపించాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూటీఎస్ అభ్యర్థి వంగా మహేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలపించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరావు, అనీల్‌కుమార్ కోరారు. జిల్లా కేంద్రంలో అభ్యర్థి తరపున ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రకాష్, గోరేసింగ్, రవి, సోనేరావు, భరత్, కవిత, శ్రీలత, రాహుల్ పాల్గొన్నారు.

'నులి'పేద్దాం



చిన్నారుల్లో పలు అనారోగ్య సమస్యలకు ప్రధాన కారణం నులిపురుగులు. వీటి నుంచి పిల్లలను రక్షించుకోవాలంటే అల్బెండజోల్ మాత్రలు వాడాలి. నులిపురుగులు పిల్లల పొట్టలోకి చేరి మెలి పెడుతూ వారి ఎదుగుదలను అడ్డుకుంటాయి. దీని వల్ల రక్తహీనత, పోషకాహార లోపంతో పాటు పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఏటా రెండు సార్లు అల్బెండజోల్ మాత్రలు వేయడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

నేడు జాతీయ నులిపురుగుల నివారణ దినం

- నులిపురుగులతో పిల్లల్లో అనర్థాలు
- నివారణకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి
- 1-19 ఏళ్లలోపు వారికి పంపిణీ

బెజ్జూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందించేందుకు తల్లిదండ్రుల కర్తవ్యం. అందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉంది. పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించడం, శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలి. ఆరోగ్య సమాజ స్థాపనలో భాగంగా ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏటా జాతీయ నులిపురుగుల(నట్టల) నివారణ దినోత్సవాన్ని(ఎన్‌డీడీ, నేషనల్ డివార్మింగ్ డే) నిర్వహిస్తోంది. ఈ నెల 10న నులిపురుగుల నివారణ దినం పురస్కరించుకొని చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు అందజేయనున్నారు. ఆ రోజు అందులో లేని పిల్లలకు ఈ నెల 17న వేయించవచ్చు.

● పరిసరాల అపరిశుభ్రతతో..

పరిసరాల అపరిశుభ్రతతో నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి. ముఖ్యంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయి. చేతి గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలి. పెరిగిన గోళ్లల్లో మట్టి చేరి అనారోగ్యానికి కారణమవుతారు. అలాగే శుద్ధజలం తాగాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయడం వల్ల నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. భోజనం చేసేటప్పుడు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలి. ఆహార పదార్థాలపై ఎప్పుడు మూతలు కప్పి ఉంచాలి. నులిపురుగులతో పిల్లల్లో పలు రకాల అనార్థాలు కలుగుతాయి. ముఖ్యంగా నులిపురుగలనేవి పేగుల నుంచి పోషకాలను గ్రహించి అభివృద్ధి చెందే పరాన్నజీవులు వీటి ద్వారా శరీరంలో రక్తహీనత, పోషకాహారలోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. నులిపురుగుల నిర్మూళనకు తప్పనిసరిగా అల్బెండజోల్ మాత్రలు వేయించాలి.

● 1,73,450 మంది పిల్లలు..

కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 1నుంచి 19ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగుల మాత్రలను వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 1-19ఏళ్లలోపు పిల్లలు 1,73, 450 మంది ఉన్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, రెసిడెన్సియల్ విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రలు వేస్తారు. 1నుంచి 2ఏళ్ల పిల్లలకు సగం మాత్ర, 2నుంచి 3ఏళ్ల వయస్సు పిల్లలకు ఒక మాత్ర పొడి చేసి నీళ్లతో తాగిస్తారు. 3నుంచి 19వయస్సున్న పిల్లలందరికి ఒక మాత్రను మింగించనున్నారు. 400 ఎంజీ పరి మాణంలో అల్బెండజోల్ మాత్ర ఉంటుంది. పిల్లల్లో సాధారణంగా మూడు రకాల నులిపురుగులు కనబడే అవకాశం ఉంది. ఏలిక పాములు, నులిపురుగులు, కొంకి పురుగులు ఉండనున్నాయి. నులిపురుగుల మాత్రల పంపిణీలో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆరోగ్యశాఖ ఆశా కార్యకర్తలను బాగస్వాములు చేయనున్నారు.

మాత్రలు తప్పనిసరిగా వేయించాలి...



- సీతారాం, జిల్లా వైద్యాధికారి, ఆసిఫాబాద్

పిల్లలందరికీ నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి. ఇప్పటికే జిల్లాకు అవసరమైన మాత్రలను సిద్ధం చేశాం. ఈ మాత్రల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. వీటి వల్ల చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదల పెరుగుతుంది. మాత్రల పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాం. తల్లిదండ్రులు సమీపంలోని అంగన్‌వాడీ, పాఠశాల, ఆరోగ్య కేంద్రం సిబ్బందిని సంప్రదించాలి. సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

వనదేవతలకు భక్తుల మొక్కులు



గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలోని సమ్మక్క,సారాలమ్మ గద్దెల వద్ద ఆదివారం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేశ్ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో జాతర కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుకుల పాఠశాల వార్షికోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బాబాపూర్‌లోని జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రత్నాబాయి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చండీయాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే హరీష్‌బాబు దంపతులు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతోషిమాత ఆలయంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, ఆయన సతీమణితో కలిసి చండీయాగంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిర్పూర్ నియోజక వర్గంలో ప్రజలు అన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో పెద్ద ఎత్తున సంతోషిమాత చండీ యాగం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లావణ్య, సత్యనారాయణ, నానయ్య, అశోక్, సాయి, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ స్థాయి దిగజారి మాట్లాడటం సరికాదు

● ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్ తన స్థాయి దిగజారి మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను అసెంబ్లీలో మాట్లాడిన సమయంలో మాజీ మంత్రి కేటీఆర్, మాజీ సీఎం కేసీఆర్ లేరన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సిర్పూరు నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించిందని, ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు సిర్పూరు ప్రాంతంలో నిర్మిస్తే ఉమ్మడి జిల్లాలకు నీరు అందేదని చెప్పానని తెలిపారు. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా ఇదే తరహాలో వ్యవహరిస్తోందన్నారు. తమను వివక్షతకు గురి చేయడం సరికాదని. తమను అభివృద్ధి చెందుతున్న మహారాష్ట్రలో కలుపాలని తెలిపానని వివరించారు. ఇదీ ప్రభుత్వానికి కనువిప్పు కలుగుతుందన్న ఉద్దేశ్యంతో చెప్పినట్టు తెలిపారు. ఈ విషయాన్ని మాజీ మంత్రి వక్రికరించడం సరికాదని తెలిపారు. సమావేశంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): బాబాసాగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళన నిర్వహిచారు. 40 ఏళ్ల అనంతరం కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకొన్నారు. అప్పుడు తమకు పాఠాలు చెప్పిన గురువులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో నగర స్వామి, మల్లయ్య, మురళీధర్‌రావు, ప్రాకర్‌రావు, హనుమంత్‌రెడ్డి, షఫిహైమద్, రూపాచారి, శ్యాంరావు, శ్రీనివాస్, చంద్రశేఖర్, నానయ్య, మల్లయ్య, తుకారాం, నాందేవ్, మాస్కూర్, నారాయణ, చరణ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వాంకిడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మహిళా కానిస్టేబుళ్ల సుమలత, వినోద, రోహిణి విద్యార్థులకు సూచించారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివారం సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో వివిధ రకాలుగా చోటు చేసుకునే సైబర్ నేరాలపై వివరించారు. సెల్‌ఫోన్‌లో వస్తున్న కొత్త నంబర్లను లేపకుండా ఉండాలన్నారు. ఎవరైనా ఓటీపీ అడిగితే వెంటనే చెప్పకుండా వాటి గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని వారు సూచించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



లక్ష్మణ్ చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న నాయకులు

జైనూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ అన్నారు. మండల కేంద్రంలో దివంగత మాజీ సర్పంచ్ లక్ష్మణ్ స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల ఆదివారం ఆయన ప్రారంభించారు. అంతకు ముందు లక్ష్మణ్ చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతు జైనూరు మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి లక్ష్మణ్ కృషి మరువలేనిదని చెప్పారు. ఆయన సేవకు గుర్తుగా క్రికెట్ పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంల మండల సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, గ్రంథాలయ సంస్థ మాజీ చర్మన్ కనక యాద వ్‌రావ్, మాజీ సర్పంచ్ మేస్రాం పార్వతి బాయి, సర్పంచుల సంఘ మాజీ మండల అధ్యక్షుడు మడావి భీంరావ్, మాజీ ఎంపీటీసీ కుంర భగ్వంత్‌రావ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో సమస్యల తిష్ఠ

» సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థినుల ఇబ్బందులు » రక్షిత తాగునీరు సైతం అందడం లేదని ఆవేదన



కళాశాలలో పని చేయని వాటర్ ప్లాంట్



జైనూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

జైనూర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరండి నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెబుతున్న అధికారులు ఆచరణలో మాత్రం సమస్యలు పరిష్కరించడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్పడమే కానీ మౌలిక వసతులు సైతం కల్పించడం లేదు. జైనూర్ ప్రభుత్వ జునీయర్ కళాశాలలో ఇంటర్‌లో మొత్తం 504 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 235 మంది విద్యార్థినులు చదువుతున్నారు. ఈ కళాశాలలో ఇంత మంది విద్యార్థులకు ప్రస్తుతం రెండు మరుగుదొడ్లు ఉన్నాయి. మరో రెండు మరుగుదొడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. మగ పిల్లలు ఆరుబయటకే వెళ్లాల్సి వస్తోంది. విద్యార్థినులు మధ్యాహ్న భోజనం సమయంలో ఒకే సారి రావడంతో లైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి నెల కొంది. మండలంలోని చుట్టు పక్కల గ్రామాల నుంచి కళాశాలకు వస్తున్న విద్యార్థినులు సాయంత్రం దాకా ఉండాల్సి ఉంది. సరిపడా మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం లేక పోవడంతో అవస్థలు తప్పడం లేదు.

● పని చేయని వాటర్ ప్లాంట్..

విద్యార్థులకు సురక్షిత తాగునీటిని అందించేందుకు కళాశాలలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కాగా కొంత కాలానికే పని చేయడం లేదు. దానికి మరమ్మతులు చేపట్టక పోవడంతో నిరుపయోగంగా మారింది. కళాశాల చుట్టు ప్రహరీ నిర్మించక పోవడంతో పశువులు తిష్ఠ వేస్తున్నాయి. దీంతో కళాశాల ఆవరణ అపరిశుభ్రమవుతోంది. ఇటీవల ప్రజాప్రతినిధులు, అధికారులు కళాశాలను సందర్శించారు. ఆ సమయంలో ఇబ్బందులను కళాశాల సిబ్బంది, విద్యార్థులు నివేదించారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

సరిపడా మరుగుదొడ్లు నిర్మించాలి..



కళాశాలలో మరుగుదొడ్లు సరిపడా నిర్మించాలి. కళాశాలలో 235 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇంత మందికి కేవలం రెండే మరుగుదొడ్లు ఉన్నాయి. మధ్యాహ్నం లంచ్ సమయంలో అందరు ఒకే సారి రావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

- అశ్విని, విద్యార్థిని

ప్రహరీ లేక అవస్థలు..



జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడ లేనందున అవస్థలు పడుతున్నాం. కళాశాల ఆవరణలోకి పశువులు చేరుతున్నాయి. దీంతో మైదానంలో అపరిశుభ్రత నెలకొంటుంది. ఉన్నతాధికారులు ప్రహరీ నిర్మాణం చేపట్టాలి.

- జంగుబాయి, విద్యార్థిని

ట్రస్మా బలోపేతానికి పాటుపడాలి



మాట్లాడుతున్న ట్రస్మా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌రావు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ట్రస్మా బలోపేతానికి సభ్యులు పాటుపడాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్‌రావు పిలుపునిచ్చారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రస్మా సంఘాన్ని చీల్చేందుకు కొంత మంది ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. సభ్యులు ఎవరి మాటలు నమ్మవద్దన్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రస్మా నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కొంత మంది తమ స్వార్థ పరులు సంఘం నుంచి బయటకు వెళ్లి బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి చౌక బారు ఎత్తుగడలు మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ట్రెజరర రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిషత్ ఎన్నికలకు కసరత్తు

» మండలంలో 8 ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీ స్థానం

» పోటీకి ఆశావాహుల సన్నద్ధం



చింతలమానేపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో పరిషత్ ఎన్నికల సందడి మొదలు కానంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో ముందుగా సర్పంచ్ పదవీ కాలం ముగిసింది. ప్రభుత్వం వాటికి కాకుండా మండల, జిల్లా పరిషత్‌ల ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. పార్టీ గుర్తులతో ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికార పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎంపిటీసీ, జడ్పిటీసీ స్థానాలను గత ఎన్నికల్లోనే ఏర్పాటు చేసిన అధికారులు 8 ఎంపిటీసీలు, ఒక్క జడ్పిటీసీ స్థానం కేటాయించారు. ఇందులో కర్జెల్లి, బాబాసాగర్, రవీంద్రనగర్-1, రణవెల్లి, గంగాపూర్, డబ్బా, గూడెం, చింతలమానేపల్లి స్థానాలు ఎంపిటీ సీ స్థానాలు కేటాయించారు. మండలంలో ఒక్క జడ్పిటీసీ స్థానం ఉన్నది. ఈ లెక్కలను ఉన్నతాధికారులకు నివేదికను అందజేసినట్లు అధికారులు చెబుతున్నారు.

● ప్రస్తుతం ప్రత్యేక పాలన..

గత ఏడాది జనవరి 31న సర్పంచుల పదవీకాలం ముగిసింది. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం అనివార్య కారణాలతో వాయిదా వేసింది. మండలంలో 8 ఎంపిటీసీ సభ్యులు ఉండగా, వారి పదవీకాలం గత ఏడాది జూలై మూడవ తేదితో ముగిసింది. మండలంలో ఉన్న ఒక్క జడ్పిటీసీ స్థానం ఒక్క రోజు తేడాతో అంటే జూలై 4వ తేదితో ముగిసింది. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ బాధ్యతలను ప్రత్యేకాధి కారులకు అప్పగించారు. ఇప్పటి వరకు స్థానిక సంస్థల్లో దేనికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాలేదు. గతంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందులో భాగంగా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని, బీసీ కమిషన్ నివేది కతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ షెడ్యూల్ విడుదల చేయడంతో ఆ ప్రక్రియ సైతం పూర్తి చేశారు. అయితే అది కాస్త పక్కన పెట్టిన ప్రభుత్వం తాజాగా పరిషత్ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించిందని సంబంధిత వర్గాలు అంటున్నాయి. 8 ఎంపిటీసీ స్థానాలు, ఒక్క జడ్పిటీసీ స్థానం లో పోటీ చేసేందుకు ఆశావాహులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏ నియోజకవర్గంలో రిజర్వేషన్ తమకు అనుకూలంగా ఉంటుంది. ఎక్కడి నుంచి పోటీ చేస్తే గెలుపొందుతామని ఆశావహులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.